జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 30-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 354 పేజీలు: 4 వెల : రూ.7


# హెచ్‌సీపై దాడి





* మద్యం మత్తులో నలుగురు ఆకతాయిలు హెచ్‌సీతో గొడవ
* హెడ్‌కానిస్టేబుల్ ముఖం, ఛాతిపై దాడి
* కేకలు వేసిన హెచ్‌సి * స్థానికులు రాకతో పరారైన నిందితులు
* పోలీసుల అదుపులో ఆ నలుగురు

**శ్రీకాకుళం క్రైం, మే 29 (వార్త):** మద్యం మత్తులో యువత ఏం చేస్తున్నారో తెలియడం లేదు. వాహనాలను రయ్‌రయ్‌మంటూ పోనిస్తున్నారు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే వారిపై దాడులకు పాల్పడుతున్నారు. గురువారం రాత్రి ఓ హెడ్‌కానిస్టేబుల్‌పై నలుగురు ఆకతాయిలు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం నగరంలోని మంగువారితోట కూడలి వద్ద డీసీఆర్‌బీ హెడ్‌కానిస్టేబుల్ పొన్నాడ త్రినాధరావు ఉన్నారు. మంగువారితోట రెల్లివీధికి చెందిన రాజేష్, వాసులతో పాటు మరో ఇద్దరు మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తున్నారు. హెచ్‌సీ వారిని ఆపే ప్రయత్నం చేశారు. వారు అతనిపై దురుసుగా ప్రవర్తించి గొడవకు దిగారు. మద్యం మత్తులో ఉన్న ఆ నలుగురు మమ్మల్లే ఆపుతావా అంటూ హెచ్‌సీ ముఖం, ఛాతిపై గట్టిగానే కొట్టారు. దీంతో హెచ్‌సీ కేకలు వేయగా స్థానికులు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఆ నలుగురు పరారయ్యారు. గాయపడిన హెడ్‌కానిస్టేబుల్ త్రినాధరావును రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ రామారావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్‌ను గాయపరచిన ఆ నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉపాధిలో అక్రమాలు



* చేసే పనులు వద్ద సదుపాయాలు కరువు
* రికార్డుల్లో మాత్రం అన్నీ ఉన్నట్టు లెక్కలు
* చోద్యం చూస్తున్న ఉపాధి అధికారులు
* మందసలో తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు * సరుబుజ్జిలి ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు


**పలాస/సరుబుజ్జిలి, మే 29 (వార్త):** మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయి. కొలతల ప్రకారం పనులు చేయించాల్సి ఉన్నప్పటికీ సంబంధిత సిబ్బంది తమకు ఇష్టారాజ్యంగా పనులు చేయిస్తూ కేంద్ర ప్రభుత్వ నిధులకు గండికొడుతున్నారు. పనులు చేసే ప్రదేశం జరిగిన పని, వేతనదారులకు ఇస్తున్న వేతనాన్ని పరిశీలిస్తే ఈ అవకతవకలపై ఎవరికైనా అనుమానం రాకపోదు. పనులు జరిగిన చోట టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాల్సివుంది. అయితే కేవలం రికార్డులకే పరిమితమవుతోంది. కొందరు ఉపాధి సిబ్బంది, మేట్లతో కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారు. పలుగ్రామాల్లో కొందరు అధికార పార్టీకి చెందిన వారి ఒత్తిళ్లతోనే ఉపాధి పనుల్లో నిబంధనలు తిలోదకాలు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు పనులకు వెళ్లకుండా వెళ్లి నట్లు హాజరు వేస్తున్నారు. పనులు చేసే వారికి చేయని వారికి ఒకేలా మస్టర్లు వేస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. నిబంధనలు ప్రకారం ఉన్న జాబ్ కార్డులకు కూలీలు గణాంకాలకు పొంతన లేకుండా ఉన్నాయి. సంబంధిత శాఖ అధికారులు లెక్కల్లో చూపిస్తున్న వారిలో పనులు చేసేది కొందరి అయితే పనులు చేయని వారు కొందరనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పనులపై అధికారుల జోక్యం చేసుకొని దర్యాప్తు చేసి నిజాలను వెలుగులోకి వస్తాయని వేతనదారులు కోరుతున్నారు.

## తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు

మందస మండలంలోని పలు పంచాయతీలకు చెందిన ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు చేశారు. ఒకేసారి తొమ్మిది మందిని తొలగించారంటే అక్కడ జరుగుతున్న ఉపాధి పనుల్లో ఏ మేరకు అక్రమాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. మందస మండలంలోని తాళ్లగురంటి, బేతాళపురం, రాంపురం, సరియాపల్లి, మందస, పొత్తంగి, భోగాపురం పంచాయతీలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉత్తర్వుల ప్రతులను అందజేశామని మందస ఏపీవో హరికృష్ణ తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల నియామకంపై ఎంపీడీవోపై ఫిర్యాదు

సరుబుజ్జిలి మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల నియామకంలో జరిగిన అక్రమాలపై పెద్దసవలాపురంనకు చెందిన



బద్రి రామారావు ఏకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఏకంగా ఎంపీడీవోనే బాధ్యులుగా చేస్తూ ఫిర్యాదు ఇవ్వడం మండలంలో కలకలం సృష్టించింది. ఉపాధి హామీ పథకంలో మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో ఎంపీడీవో నియమ నిబంధనలు పాటించలేదని, గ్రామసభ తీర్మానం లేకుండా నియమించేశారని ఆ ఫిర్యాదులో ఆమదాలవలస మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు రామారావు పేర్కొన్నారు.

# నేడు పలాసలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పలాస, మే 29(వార్త):** పెంటిభద్ర (కాశీబుగ్గ) 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమత్తులు, 11కేవీ చినబాడాం ఫీడర్ మీద ఆర్ డి ఎస్ ఎస్ స్కీం లో కొత్త విద్యుత్ లైన్లు వేయుటకు శుక్రవారం ఉదయం 10:00 గం.ల నుండి మధ్యాహ్నం 04.00 గం.ల వరకు విద్యుత్ నిలుపుదల చేయబడునని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి యజ్ఞేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రీనివాస నగర్ , అనంతపురం , జిఎంఈ , కొబ్బరి చెట్లూరు, ఆర్ కె పురం, పెంటిబద్ర, జయారంచంద్రపురం, పద్మ నాభపురం, పాత ఎన్‌హెచ్ 5, తాలభద్ర నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబాడాం అంతరకుడ్డ , రాజపురం, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని ఒక ప్రకటన తెలిపారు. వినియోగదారులంతా విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

# నైరుతి రుతు పవనాలపై అప్రమత్తం

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**




**శ్రీకాకుళం, మే 29(వార్త):** జిల్లాలో నైరుతి రుతుపవనాలు వారం ముందుగానే ప్రవేశించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి జరిగిన సన్నద్ధత సమీక్ష సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో పాల్గొన్నారు. గత సంవత్సరం ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి మరింత సమగ్రంగా, పటిష్టంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) ప్రకారం కార్యాచరణను రూపొందించుకొని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, వాటి ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చెరువుల గట్లను ఉమ్మడిగా తనిఖీ చేసి, వాటి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో వ్యవసాయ శాఖ విత్తనాలు, ఎరువుల పంపిణీపై కార్యాచరణ రూపొందించాలని, నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు నిల్వ చేసిన దుకాణాలపై లైసెన్సులు రద్దు చేయాలని హెచ్చరించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులు పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని తెలియజేశారు.నదీ పరివాహక గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కాజ్‌వేలు రోడ్లపైకి వరద నీరు వచ్చే ప్రాంతాల్లో వాహనాలకు ఆ సమయంలో అనుమతి ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇరిగేషన్, విద్యుత్ (ఏపీ ఈపీడీసీఎల్), రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రత్యేకంగా చెప్పారు. గత ఏడాది హిరమండలం-కొత్తూరు మధ్య రోడ్డు పైకి వరద నీరు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశం ద్వారా జిల్లా యంత్రాంగం రుతుపవనాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని, జిల్లా ప్రజల రక్షణే తమ ముఖ్య బాధ్యతగా భావిస్తూ తగిన చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వరరావు, డిపిఓ భారతీ సౌజన్య, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, విపత్తుల నిర్వహణ శాఖ అధికారి రాము, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, డిఎం అండ్ హెచ్ ఓ అనిత, ఇరిగేషన్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్ , మత్స్య శాఖ ఉపసంచాలకులు సత్యనారాయణ పలు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఎన్‌వైకే ఆధ్వర్యంలో యోగాసనాల ప్రదర్శన



**శ్రీకాకుళం, మే 29(వార్త):** యోగాంధ్ర 2025 వేడుకల సన్నాహకాల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక యోగాసనాల ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేషనల్ యువత సేవకులు మరియు వివిధ యువజన సంఘాల సభ్యులతో సహా మొత్తం 70 మంది యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా గురువులు మురళి, టి.స్వాతి పర్యవేక్షణలో విశాఖ బి కాలనీ సాయిబాబా మందిరం ఆవరణలో జరిగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న యువత, వివిధ రకాల యోగాసనాలను సమర్థవంతంగా ప్రదర్శించి తమ శారీరక దృఢత్వాన్ని, ఫిట్‌నెస్‌ను చాటారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె. మురళీధర్ రావు కూడా యువతతో కలిసి యోగాసనాలలో పాల్గొని వారికి స్ఫూర్తినిచ్చారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె.వి. ఉజ్వల్, అకౌంట్స్ ఆఫీసర్ డి. శ్రీనివాస్, సెట్ శ్రీ సీఇఓ బి. ప్రసాద రావు హాజరై యువతను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

# ఆటోల్లో సురక్షిత ప్రయాణానికి క్యూఆర్ కోడ్



**పలాస, మే 29 (వార్త):** సురక్షా యాప్ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇటీవల ఆవిష్కరించారని కాశీబుగ్గ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆటోలకు సురక్షాయాప్ క్యూఆర్ కోడ్ జనరేట్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు ఒంటరిగా ఆటోలో తిరిగే సమయంలో వారి సమాచారం తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుందన్నారు. పాసింజర్కు ఆటో వివరాలు తెలుసుకొనేం దుకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు ఏర్పాటుచేస్తున్నట్లు ఎస్ఐ తెలి పారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఆటో డ్రైవర్లకు క్యూర్కోడ్ స్టికర్లపై అవగా హన కల్పించి ఆటోలకు అతికించారు. ఆటో డ్రైవర్తో ఎటువంటి సమస్య వచ్చినా ఆటో ఎక్కిన పాసింజర్ క్యూఆర్ కోడ్ స్టిక్కరును స్కాన్ చేసి వివరాలు తెలియజేస్తే సమస్య సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

**సరుబుజ్జిలి, మే 29 (వార్త):** ఆటోలకు సరుక్ష పేరుతో క్యూ ఆర్ కోడ్ గల స్టిక్కర్లను అంటించడం ప్రారంభించామని ఎస్ఐ బి.హేమావతి తెలిపారు. సరుబుజ్జిలి, ఎల్ ఎన్ పేట మండలాల్లో ఆటోలకు సురక్ష క్యూ ఆర్ కోడ్ స్టీకర్లల్ ను అమర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా ఆపద ఉన్నామని గ్రహించి న వెంటనే క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే, ఆటో పూర్తి వివరాలు మీరు ఎక్కడ కి ప్రయాణిస్తున్నారు, లైవ్ లొకేషన్స్ సదరు పోలీస్ స్టేషన్‌కు చేరుతాయన్నారు. వెంటనే ఆపదలో ఉన్న వారిని పోలీసులు కాపాడతారని తెలిపారు. ప్రమాదాల సమయంలో సమాచారం, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలు పటిష్టం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ధనం, నవీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## ముగిసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం

**మందస, మే 29(వార్త):** బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన 30 రోజుల వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి కాలాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు విద్యార్థులను, ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గ్రామస్తులను అభినందించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఉమాపతి మాట్లాడుతూ ఇరువంటి కార్యక్రమాలు ప్రతి ఏడాది నిర్వహిస్తామని, పాఠశాలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సుమారు పదిమంది ఉపాధ్యాయులను సత్కరించారు. గ్రాండ్ టెస్ట్ లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు కర్రి తాతారావు, క్యాషియర్ రాపాక కేశవరావు, ఎస్ఎంసీ చైర్మన్ కరగాన వల్లభరావు, ఉపాధ్యాయులు సార భాస్కరరావు, దాసరి ఈశ్వరరావు, వంకల పాపారావు, రాపాక వల్లభ రావు, శాలిన శ్రీహర్ష, పసుపురెడ్డి కాంతారావు, సాలిన శిరీష, భాష్యం మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత విద్యకు 30 మంది ఎంపిక

**ఇచ్ఛాపురం, మే 29 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థుల కోసం విద్యా హక్కు చట్టం కింద ఉచిత విద్యను పొందడానికి మొదటి విడత జాబితాలో 30 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. వీరు వారికి కేటాయించినటువంటి ప్రైవేటు పాఠశాలల్లో జూన్ 7 లోపల పాఠశాలల్లో జాయిన్ అవ్వాల్సిందిగా మండల విద్యాశాఖ అధికారులు కురమాన అప్పారావు, విశ్వనాథం తెలిపారు. ప్రవేట్ పాఠశాల యాజమాన్యం ఎంపికైనటువంటి విద్యార్థులను నేరుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశానుసారముఎంపికైనటువంటి విద్యార్థులను జాయిన్ చేసుకోవలసిందిగా మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఎంపికైనటువంటి విద్యార్థులను మండల విద్యాశాఖ కార్యాలయం నందు మరియు నేరుగా ఎంపికైన ప్రతి విద్యార్థికి ఫోన్ ద్వారా సమాచారం అందించామని చెప్పారు ఎంపికైన విద్యార్థులు నిర్దేశించినటువంటి పాఠశాలల్లో జాయిన్ అవ్వాల్సిందిగా కోరారు.

## 31 నుంచి పర్యావరణ వారోత్సవాలు



**శ్రీకాకుళం, మే 29(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం -2025 ను పురస్కరించుకొని ఈనెల 31 నుంచి జూన్ 5 వరకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, భవిష్యత్ తరాల కోసం పుడమి సంరక్షణ అనే అంశంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని పర్యావరణ ఇంజనీర్ కరుణశ్రీ తెలిపారు. అందులో భాగంగా శనివారం 6 నుంచి 10 వ తరగతుల విద్యార్థులకు న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా ఉదయం 10గంటలకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు జూన్ 4న ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు), ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) శ్రీకాకుళం నందు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించబోతున్నామన్నారు. ఆసక్తి గల బాలురు బాలికలు పాల్గొనాల్సిందిగా కోరారు. పచ్చదనాన్ని పెంచడానికి పైడిభీమవరం, టెక్కలి, వివిధ గ్రామాల్లో 5000 మొక్కలు నాటనున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి గుడ్డ సంచులను కూడా వితరణ చేయనున్నామన్నారు. జూన్ 5న గ్రీన్ ర్యాలీ, సమావేశాలను నిర్వహించి విజేతలకు బముమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9494590115, 9010854409ను సంప్రదించాలని ఆమె సూచించారు.

## పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మందస, మే 29(వార్త):** ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని మందస శాఖా గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు జరిగిన పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశాలపై కార్యక్రమంలో విజయలక్ష్మి మాట్లాడుతూ పరిశుభ్రతతోనే ఆరోగ్యం వస్తుందన్నారు. పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో అవసమని, సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**ఇచ్ఛాపురం, మే 29 (వార్త):** రామ్ మనోహర్ లోహియా ఆరోగ్య జీవన్ సంస్థా, రాజస్థాన్ సహకారంతో మెగా అక్యుప్రెషర్ వైద్య శిబిరం జూన్ 2 నుంచి 7 వరకు రోటరీ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు చైర్మన్ వెంకటేష్ రెడ్డి తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 వరకు, మరియు సాయంత్రం 4 నుంచి 8 వరకు ఉంటుందని చెప్పారు. నమోదు కోసం 8686005235 నంబర్‌కి కాల్ చేయాలని అధ్యక్షులు రాజ్‌కుమార్ మచర్ల, సెక్రటరీ దినేశ్ కుమార్ పైడిశెట్టి సూచించారు.

## నేడు మందసలో విద్యుత్ అంతరాయం

**మందస, మే 29(వార్త):** మందస మండలంలోని ఈ నెల 30న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు, మందస ఏఈ ఎల్.యోగి చెప్పారు. శనివారం నాడు ఆర్డీఎస్-ఎస్ నిర్వహణ పనులను పలాసలోని 132/33కేవీ సబ్ స్టేషన్ లో చేపడున్నట్టు వారు తెలిపారు. దీని కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మందస మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.



## ఘనంగా మంకినమ్మ తల్లి సంబరాలు

**పలాస, మే 29(వార్త):** మంకినమ్మ తల్లి సంబరాలు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. గురువారం చివరి రోజు కావడంతో అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులంతా ఉదయానికి ఆలయాన్ని చేరుకుని దీప దూప నైవైద్యాలు తోపాటు అమ్మవారికి ప్రీతి ప్రాతమైన ఖజ్యం తో పాటు ముఠ్రాట, వేపాకులు, నైవేద్యం భక్తులు సమర్పించుకున్నారు. గడిచిన మూడు రోజులుగా అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తూ తిరునాళ్ళు మాదిరిగా కోలాటం ఏర్పాటు చేశారు. భక్తులు శక్తి మేరకు అమ్మవారికి కానుకలు సమర్పించుకున్నారు. కాశీబుగ్గలో హై స్కూల్ గ్రౌండ్ లో ఉన్న మంకినమ్మకు భారీ పందిరి వేసి గ్రౌండ్ అంతా అలంకరణ చేసి, విద్యుత్ అలంకరణ చేశారు. చుట్టుపక్కల వారి కోసం గ్రౌండ్లో తిరుణాల మాదిరిగా జైంట్ వీల్, వివిధ రకాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ఆకొట్టుకున్నారు. గురువారం ముగింపు రోజున వేలాదిమంది భక్తుల కోసం అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## ప్రిన్సిపాల్‌గా చింతాడ శరత్‌బాబు



**మందస, మే 29(వార్త):** మందస మండలంలోని కుంటికోట గ్రామానికి చెందిన చింతాడ శరత్‌బాబు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆయన మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో జంతు శాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తున్నారు. 2009వ సంవత్సరంలో జూనియర్ అధ్యాపకునిగా బారువా జూనియర్ కళా శాలలో విధుల్లో చేరిన ఆయన రెండు, మూడు చోట్ల అధ్యాపకునిగా పని చేశారు. చింతాడ శరత్ బాబు అధ్యాపకునిగా మంచి పేరుంది. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు స్వయంగా తన చేతిలోనే నగదుతో వారికి నగదు బహు మతి అందివ్వడం ఆయనకు అలవాటుగా మారింది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, ఘనంగా సన్మానించే వారు. జాతీయ సేవా పథకం జిల్లా సలహాదారునిగా పని చేసిన కాలంలో శరత్ బాబు చేసిన సేవలు జిల్లా వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారు. రక్తదానం శిబి రాలు, సేవా కార్యక్రమాలు ఆయనకు ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాయి. ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా బారువా, పలాస, కవిటి, కంచిలి, మందసలలో ఆయన తన బాధ్యత లను ఎంతో సమర్ధవంతంగా నిర్వహించారు. చింతాడ శరతాబాబు పని చేసిన ప్రతీ చోట స్థానికుల అభినందనలు పొందడం పరిపాటిగా మారింది. సీనియర్ ప్రాతిపది కన ఆయనకు ప్రిన్సిపల్ గా పదోన్నతి రాగా.. ఈ ఉత్తర్వులు ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ నుంచి శరత్‌బాబు అందుకున్నారు. చింతాడ శరత్ బాబుకు ప్రిన్సిపల్ గా పదోన్నతి వచ్చిందని తెలుసుకున్న ఆయన అభిమానులు, విద్యార్థులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

## ముున్సిపల్ చైర్‌పర్సన్‌కు.. వైస్ చైర్‌పర్సన్ లీగల్ నోటీసులు



**-టౌన్ ప్లానింగ్ అధికారికి కూడా**

**-పరువు ప్రతిష్టకి భంగం కలిగించారని దావా**

**ఇచ్ఛాపురం, మే 29 (వార్త):** మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి కి, టౌన్ ప్లానింగ్ అధికారి సనప వినయ్ ప్రసాద్ కు వైస్ చైర్ పర్సన్ లాభాల స్వర్ణ మణి లీగల్ నోటీసులు జారీ చేశారు. తన పరువు ప్రతిష్ట లకు భంగం కలిగించారని పరువు నష్టం దావా వేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. ఫిబ్రవరి లో తనపై టిపివో అసత్య ఆరోపణలు చేసారని, మార్చిలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ ఎజెండా లో చేర్చి తన ప్రతిష్ఠ కి భంగం కలిగించారన్నారు. దీనిపై నోటీసులు జారీ చేస్తూ కోర్టు లో పరువు నష్టం దావా వేస్తున్నట్లు ఒక ప్రకటన లో తెలిపారు. ఇటీవలి స్వర్ణ మణి పై అనర్హత వేటు వేయడం తర్వాత హై కోర్టులో ఊరట లభించడం విదితమే.

## మహానాడుతో నూతన ఉత్తేజం

**ఇచ్ఛాపురం, మే 29 (వార్త):** తెలుగుదేశం పార్టీ మూడు రోజుల పాటు కడప లో నిర్వహించిన మహానాడుతో నూతన ఉత్తేజం వచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర బి సి రెడ్డిక సాధికారత సమితి చైర్మన్ కొండ శంకర్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ నుంచి కేవలం నలుగురు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ,ఎమ్మెల్యే అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రత్తకన్న 20 వ వార్డు నుంచి సుభాష్ రౌలో, 23 వ వార్డు బెల్లు పడా కాలనీ నుంచి సంతోష్ రథో, దనపన హరికృష్ణ తదితరులు హాజరయ్యారు.



# డీ అడిక్షన్ కేంద్రాలు సమర్ధంగా పనిచేయాలి

**-ఎక్సైజ్ అధికారులతో సమీక్షలో**

**కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, మే 29(వార్త):** అక్రమంగా తయారవుతున్న మద్యం (ఇలిసిట్లీ డిస్టిల్డ్ లిక్కర్ – ఐడి లిక్కర్) వల్ల తలెత్తుతున్న ఆరోగ్య, ఆర్థిక సమస్యలపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టిన చర్యలపై, ముఖ్యంగా మద్యం బారిన పడిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనపై ఆయన ఎక్సైజ్ శాఖ అధికారులతో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడీ మద్యంతో బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఈ కుటుంబాలకు తక్షణమే ప్రత్యామ్నాయ జీవనోపాధిని అందించాలని సూచించారు. మద్యం తయారీకి ఉపయోగించే ముడి సరుకులపై నియంత్రణ పెట్టాలని, ఇందులో ప్రధాన పాత్ర పోషించే వ్యక్తులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన కేర్ కమిటీ (కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యకలాపాలను సమీక్షించారు. ఇప్పటివరకు ఈ కమిటీ ద్వారా 16 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, 595 మంది పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రాన్ని తాను ఒకసారి సందర్శించినట్లు గుర్తు చేసుకున్నారు. ఈ కేంద్రంలో తొమ్మిది మంది చేరగా, ఏడు మంది విజయవంతంగా పునరావాసం పొందినట్లు అధికారులు వెల్లడించారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఐడి మద్యం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సమస్యలు, కుటుంబాలపై ప్రభావం, విద్యాభ్యాసం, ఉపాధి వంటి అంశాల్లో సానుకూల మార్పు తీసుకొచ్చేలా చైతన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నెల 2వ, 4వ శనివారాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, డీ-అడిక్షన్ కేంద్రాలను మరింత సమర్థంగా ఉపయోగించుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఎక్సైజ్ రామచంద్రరావు, అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీ సిహెచ్ వివేకానంద, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండా.. పార్కింగ్ అడ్డానా?

**-ప్రైవేటు వాహనాల పార్కింగ్ నిలయంగా మారిన సరుబుజ్జిలి బస్టాండ్ -పట్టించుకోని అధికారులు**





**(సరుబుజ్జిలి -వార్త)**

సరుబుజ్జిలిలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. కొంతకాలంగా ఇదే తంతు సాగుతున్న పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని,తక్షణమే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.బస్టాండ్ ప్రాంగణంలో బస్సుల కన్నా ప్రైవేటు వాహనాల సందడి ఎక్కువగా కనిపిస్తూ ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్ చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో అడ్డదిడ్డంగా ప్రైవేటు వాహనాలు వస్తుండడంతో బస్టాండ్ కు వచ్చే ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు వాపోయారు.

**కానరాని ప్రహరీ..**

బస్టాండ్ చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో బస్టాండ్ కాస్త ప్రైవేట్ వాహనాలకు అడ్డాగా మారిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు పలుమార్లు బస్టాండ్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం కొరకు కొలతలు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎందుకు నిర్మించడం లేదో అధికారులకే తెలియాలి లేదా ఇంకేమైనా వేరే కారణాలు ఉన్నాయా అన్న అనుమానాన్ని పలువులు వ్యక్తపరుస్తున్నారు.ఆర్టీసీ రాబడి కోసం ఇనుప స్తంభాలతో ఫ్లెక్సీలు పెట్టుకోవడానికి పెద్ద పెద్ద హోర్డింగ్స్ ఏర్పాటు చేసిన అధికారులు ప్రహరీ గోడ నిర్మాణం కూడా చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై సరుబుజ్జిలి రీజినల్ మేనేజర్ ను వివరణ కోరగా ద్విచక్ర వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటే పార్కింగ్ ఫీజు పెట్టే ఆలోచన చేస్తామని, బస్టాండ్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం కొరకు ప్రతిపాదనలు పంపామని అన్నారు.

# బాధితులకు ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, మే 29 (వార్త):** ఈ నెల 26 న కంచిలి మండలం చిల్లపుట్టుగ గ్రామం లో ప్రమాదవసాత్తు జరిగిన విద్యుత్ షాక్ వలన ముగ్గురు వ్యక్తులు మరణించిన సంఘటన తెలిసిందే.సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి ఐదు వేల రూపాయల చొప్పున 15 వేలు రూపాయలమొత్తం ఆర్థిక సహాయం అందించారు. జరిగిన సంఘటన గురించి విద్యుత్ శాఖ అధికారులు కు తెలియజేసి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున నష్టపరిహారం ఇప్పించవలసిందిగా కోరారు. గత రెండు నెలలుగా నియోజకవర్గం లోని అనేక గ్రామాలలో సంబరాలు, దేవుని పూజలు జరుగుచున్నవనిఇప్పటికైనా విద్యుత్, ఫైర్ అండ్ సేఫ్టీ, హెల్త్ అండ్ శానిటేషన్, పోలీస్ శాఖ ఇటువంటి వేడుకలు జరిగే ప్రతీ గ్రామంలో తగు జాగ్రత్తలు తీసుకుని ప్రణాలికను తయారుచేసి ప్రమాదాలు, గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో అనిరుధ్‌కు బంగారు పతకం

**మెళియాపుట్టి, మే 29 (వార్త):** విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణించి, అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును మెళియాపుట్టి గ్రామానికి చెందిన బాలుడు పొట్నూరు అనిరుధ్‌కుమార్ సాధించాడు. అనిరుధ్‌కుమార్ విశాఖలో ప్రైవేట్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడని, స్కేటింగ్‌లో అండర్ 14 విభాగంలో ఇటీవల శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ రోల్ బాల్ ఫెడరేషన్ వారు నిర్వహించిన చాంపియన్ షిప్‌లో బంగారు పతకాన్ని సాధించాడని తల్లిదండ్రులు నవీన్ కుమార్ మీనాక్షిలు గురువారం తెలిపారు. ఆయన విజయంపై బంధువులు, గ్రామస్తులు, ప్రతి ఒక్కరూ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.






జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 24 కిలోల గంజాయి పట్టివేత

**నరసన్నపేట, మే 29 (వార్త):** మడపాం టోల్‌గేట్ వద్ద గురువారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరు వ్యక్తుల నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒడిశాకు చెందిన వ్యక్తులని తెలిపారు. కేసు నమోదు చేశామని, వారి నుంచి వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## నగదు మాయంపై ఫిర్యాదు

**శ్రీకాకుళం క్రైం, మే 29 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని నక్క వీధిలో నివాసముంటున్న బి.శ్రీనివాసరావు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.75 వేలు నగదు మాయమైనట్లు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇల్లు మారే సమయంలో చెక్ బుక్ పోయిందని, ఆ చెక్కును బుధవారం ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని ఎస్‌బీఐ శాఖలో ఫోర్జరీ సంతకంతో జమ చేసి రూ.75 వేలు కాజేశారని వివరించారు. కె.సురేష్ కుమార్ పేరుతో ఆ నగదు చెల్లించినట్లు తెలిపారని బ్యాంకు అధికారులు తెలిపారన్నారు. అనంతరం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.సంతోష్ తెలిపారు.

# కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్.. సోదాలు

* జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు
* పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**శ్రీకాకుళం క్రైం, మే29 (వార్త):** నేర నియంత్రణ చర్యలలో భాగంగా టెక్కలి పోలీసు సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు గురువారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సోదాలు నిర్వహించి, విసృతంగా తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఉదయం టెక్కలి, పాతపట్నం, కొత్తూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి పోలీసు స్టేషనులు పరిధిలో సిఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వారి పరిధిలో ఉన్న పలు వార్డు, గ్రామాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఊరు చివర ప్రాంతాల్లో సోదాలు చేసి అక్రమ మద్యం, గంజాయి, నిల్వలపై ఆరా తీశారు. పాత నేరస్థులు, ట్రబుల్ మాంగర్స్, అనుమానిత, నేర చరిత్ర కల్గిన వ్యక్తులు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఎటువంటి, సరైన వాహన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు గుర్తించి, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.












Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546